

బోయాడు. కానీ, ఆమె ఏమీ మాట్లాడవద్దని సైగచేసి లోనికి తీసుకుపోయింది.

ఆ మేడలో రసాతల దేవతయేమో అన్నట్లుగా ప్రకాశి స్తున్న ఒక సుందరిని చూశాడు. దానితో అతని మనసు మన్మథ బాధకు గురయింది. మరో మన్మథునిలా కనిపి స్తున్న కువలయాశ్వుని చూసి, ఆ తరుణి కూడా చిత్తభ్ర మకు, లజ్జా విస్మయాలకు లోనైంది.

''మహాభాగా! ఈమె పేరు మదాలస. విశ్వావసుడనే గంధర్వరాజు కుమార్తె. ఈమె ఒకనాడు ఉద్యానంలో విహరిస్తుండగా, పాతాళకేతుడనే రాక్షసుడు ఎత్తుకొచ్చి ఇక్కడ దాచాడు. రాబోయే త్రయోదశినాడు ఈమెను వివాహమాడాలని నిశ్చయించుకున్నాడు. ఇక్కడినుంచి ఎలా తప్పించుకోవాలా అని మేము ప్రయత్నిస్తుండగా దైవఘటనలా మీరిక్కడికి వచ్చారు. మీ రూపం చూడ గానే మీరు ఉత్తమవంశంలో పుట్టినవారని, మహావీరు లని అర్థమవుతున్నది. మా రాకుమారి మీపై మరులు గొంది. దయచేసి ఈమె పాణిగ్రహణం చేయండి'' అని చెలికత్తె రాయబారం నడిపింది.

వారిద్దరి వివాహం అప్పటికప్పుడే జరిగిపోయింది.

మదాలసను కూడా తన కువలయాన్ని ఎక్కించు కుని, ఋతుధ్వజుడు బయల్దేరగా.. చతురంగ బలా లతో పాతాళకేతుడు అడ్డంపడ్డాడు. శరవర్షం కురిపిం చాడు. కువలయాశ్వుడు నవ్వుతూ, రక్కసులపై త్వష్టాస్త్రం ప్రయోగించాడు. ఆ దెబ్బతో కపిలుని దృష్టి తగిలిన సగర పుత్రుల్లా, వారంతా బూడిద కుప్పల య్యారు.

అటుపైన కువలయాశ్వుడు తండ్రి వద్దకు వెళ్లి, జరిగి నదంతా నిర్భయంగా చెప్పాడు. మదాలసను చూపిం చాడు. శత్రుజిత్తు కుమారున్ని ఆలింగనం చేసుకుని ఆశీ ర్వదించాడు. ఆనాటినుంచి కువలయాశ్వుడు తన భార్యతో గూడి, తన ఉత్తమాశ్వాన్ని అధిరోహించి.. ప్రతిదినం పర్వత సానువులపై, సముద్రాలపై, నదీతీరా లలో స్వేచ్ఛగా విహరించేవాడు.

ఒకనాడు శత్రుజిత్తు కుమారున్ని పిలిచి..

''వత్సా! నువ్వు ప్రతిదినం అశ్వమెక్కి ఎక్కడికో వెళ్తు న్నావు. కానీ నీ అసలు కర్తవ్యం తపోధనుల రక్షణ. ఆ మాట మరిచిపోకు'' అని ప్రబోధించాడు. నాటినుంచి కువలయాశ్వుడు, మధ్యాహ్నం వరకు భూమండల పర్యటన చేసేవాడు. సాయంత్రం వరకు పండితగో ష్ఠులు నిర్వహించేవాడు. తక్కిన సమయంలోనే భార్యతో క్రీడిస్తుండేవాడు.

పాతాళకేతుని తమ్ముడు తాళకేతువు. వాడు చాలా పెద్ద మాయావి. ఒకనాడు వాడు తాపసి వేషం వేసు కుని.. కువలయాశ్వుడు వచ్చేదారిలో ఒంటికాలిపై తపస్సు చేయసాగాడు.

కువలయాశ్వుడు అతణ్ని చేరి..

''మహాత్మా! మీ తపస్సు నిర్విఘ్నంగా కొనసాగుతు న్నదా? రాక్షసబాధ లేదు కదా?!'' అని పరామర్శిం చాడు.

అందుకు ఆ కపట తాపసి..

''రాజపుత్రా! నీవంటి శూరుడు మాకు రక్షణ కల్పి స్తుండగా.. తపోవిఘ్నాలకు తావులేదు. కాకపోతే నిన్నొ కటి యాచిస్తున్నాను. కాదనకుండా ఇవ్వగలవా?'' అని ప్రశ్నించి, అలాగేనని కువలయాశ్వుని వద్ద మాట తీసు కున్నాడు.

''నేను ఒక యజ్ఞం చేయదలిచాను. దానికి వారుణ ఇష్టి జరిపించాలి. ఈ నీటియందు ప్రవేశించి.. నేను కొంతకాలం తపస్సు చేయవలసి ఉంది. నా తపస్సు కొనసాగుతున్నంత కాలం నువ్వు ఈ తీరంలోనే కాపలా ఉండాలి. అలాగే ఆ ఇష్టికి కంఠాభరణం అవ సరం. కనుక నీ కంఠాభరణాన్ని నాకు ఇవ్వాలి'' అని కోరాడు.

కువలయాశ్వుడు అతను చెప్పినట్లే చేశాడు. కపట తాపసి అయిన తాళకేతువు ఆ నగను మెళ్లో వేసుకుని, యమునా నది నీటిలో దిగాడు. రెండుమూడు రోజుల తరువాత కువలయాశ్వుని కన్ను పడకుండా.. నేరుగా శత్రుజిత్తు వద్దకు వెళ్లాడు.

''రాజా! నీ కుమారుడు రాక్షసులతో యుద్ధం చేస్తూ మరణించాడు. ప్రాణాలు విడిచిపెడుతూ.. నాకీ కంఠా భరణాన్ని బహుకరించాడు'' అని చెప్పాడు.

శత్రుజిత్తు ఆ మాటలు నమ్మాడు. దుఃఖాన్ని తన లోనే దిగమింగుకుని, కోడలైన మదాలసకు ఆ వార్త తెలియచేశాడు.

భర్త మరణవార్త వింటూనే ఆ మహాసాధ్వి మొద లంట నరికిన చెట్టులా నేలకూలింది. ప్రాణాలు విడిచిపె ట్టేసింది.

''క్షత్రియుడు యుద్ధరంగంలో వీరమరణం పొందడం, అతని స్త్రీ ఇచ్ఛామరణంతో అతణ్ని సహగ మించడం కోటియజ్ఞాలు చేయడంతో సమానమని ఆర్యులు చెబుతారు. వీరి మరణానికి చింతించాల్సిన పని లేదు'' అని మనసును సమాధాన పరుచుకున్నాడు శత్రుజిత్తు.

మరికొద్దిరోజులకు.. తాళకేతుడు యమునా నదీజలా లనుంచి ఈవలకు వచ్చాడు.

''రాజా! నా చిరకాల వాంఛ నెరవేరింది. నీకు కృత జ్ఞుడను. నీవింక ఇంటికి పోవచ్చు'' అన్నాడు.

''మహాప్రసాదం!'' అని పలికి, కువలయాశ్వుడు ఇంటిముఖం పట్టాడు. నగరం పొలిమేరల్లోనే అతణ్ని చూసి అందరూ తెల్లమొహం వేసుకున్నారు. మొత్తానికి చనిపోయాడనుకున్న రాజపుత్రుడు తిరిగి రావడంతో సంతోషించారు.

మదాలస మరణవార్త విని, కువలయాశుడు హతా శుడైపోయాడు.

''నావల్ల ఆమె మరణించింది. ఆమె మాట వినగానే నేను కూడా చనిపోయి ఉండవచ్చు. కానీ అది స్త్రీలకు శోభస్కరం కానీ, పురుషులకు కాదు. ఆమెకోసం రోదిం చడమూ యశస్కరం కాదు. శత్రువులు లోకువ చేసి పరాభవిస్తారు. కాబట్టి నేనింక ఇంతటితో స్త్రీభోగానికి దూరంగా ఉంటాను. దీనివల్ల నా మదాలసకు ఎలాంటి ఉపయోగమూ లేకపోయినా పరవాలేదు. నేను వేరొక స్త్రీని మాత్రం వివాహమాడను'' అని ప్రతిజ్ఞ చేశాడు.

నాటినుంచి తోటివారితో కలిసి, శృంగారరహితమైన వినోదాలతో కాలక్షేపం చేస్తూ గడపసాగాడు.

* * *

..నాగకుమారులు ఈ కథను ఇంతవరకూ తండ్రితో చెప్పారు.

''తండ్రీ! అతనికి మనం ఏమిచ్చినా సంతోషం కల గదు. అతని ప్రియురాలైన మదాలసను తిరిగి ఆయ నకు అర్పించినట్లయితే.. పూర్తిగా సంతోషిస్తాడు. కానీ, ఆ పని మనకు శక్యం కాదు'' అన్నారు.

అందుకు నాగరాజు అయిన అశ్వతరుడు ఇలా చెప్పాడు.

''పుత్రులారా! అశక్యమని ఏ కార్యాన్నీ విడిచిపెట్ట కూడదు. శక్యమని తలచి ప్రయత్నించాలి. కర్మఫలం దైవంలో ఉంటుంది. దున్నకుండా భూమి పండదు కదా! అందువల్ల నేను ప్రయత్నించి, ఆ మహాత్మునికి నాకు చేతనైనంత ఉపకారం చేస్తాను''.

ఆ తర్వాత హిమాలయాలలో ప్లక్షతీర్థం చేరుకు న్నాడు. అక్కడ సరస్వతీదేవిని గురించి తపస్సు చేశాడు.

'భూమియందు, ఆకాశమందు, ఇతర స్థలముల యందు ఉన్న స్థూల, సూక్ష్మ, వస్తుజాలానికి అంతటికీ నీవే ప్రధానురాలవు. నీవల్లనే సృష్టి స్థితి లయాలు జరు గుతున్నాయి'.. అని దేవిని స్తోత్రం చేశాడు.

అతని భక్తివిశ్వాసాలకు భాషాదేవి సంతోషించింది. ఏం వరం కావాలో కోరుకోమని అడిగింది.

''తల్లీ! నాకు కంబళుడు అనే మిత్రుడు కలడు. మా ఇద్దరికీ స్వరసంబంధమైన సంగీతవిద్య అంతా వచ్చేలా అనుగ్రహించు'' అని ప్రార్థించాడు. 'తథాస్తు' అని పలికి, సరస్వతి అంతర్హితురాలైంది.

అశ్వతరుడు తన స్నేహితుడితో కలిసి.. శివపార్వ తులు విహారం చేస్తున్న సమయంలో, ఎలుగెత్తి గానం చేయసాగాడు. శంకరుడు వారి గానానికి సంతోషిం చాడు. ఏం వరం కావాలో కోరుకోమన్నాడు.

''మహాత్మా! మదాలస అనే గంధర్వపుత్రి అసత్య వార్త విని, తన భర్త మరణించాడని అనుకుంది. వెను వెంటనే తానూ మరణించింది. ఆమె తిరిగి నా కడుపున పుట్టేలా అనుగ్రహించు. ఆమె చనిపోయేనాటికి ఏ వయసులో ఉందో.. తిరిగి అదే వయస్సులో నాకు పుట్టాలి. ఆనాటి స్మృతి ఆమెకు ఉండాలి'' అని కోరాడు.

అప్పుడు శంకరుడు..

''ఓ నాగరాజా! నువ్వు కోరినట్లే జరగగలదు. విను.. నువ్వు ఈసారి పితృకార్యం చేసేటప్పుడు.. శుచివై, మధ్యపిండాన్ని నువ్వే ఆరగించు. అప్పుడు నీ నడిమి పడగనుంచి మదాలస తిరిగి పుడుతుంది'' అని పలి కాడు.

''ధన్యోస్మి'' అని పలికి.. పార్వతీ పరమేశ్వరులకు మొక్కి వెనక్కి వచ్చాడు అశ్వతరుడు.

శంకరుడు చెప్పినట్లుగా భక్షించిన వెంటనే నాగరాజు చేసిన నిశ్వాసం నుంచి మదాలస తిరిగి జన్మించింది.

**(వచ్చేవారం.. అలర్కుని చరిత్ర)**